# నీతి మాలినోడు

"కనుక్కున్న కూతురికీ, పక్కలోకి వచ్చిందానికీ తేడా తెలీకపోతే ఎలాగ్గ రంగబాబూ?" అన్నాడు చిట్టిగాడు.

"కూతురెవర్రా?" అనడిగాను ఆశ్చర్యపోతూ.

"అదేటి? గేపకం నేదా? తొలీత ఇరవయ్యేళ్ళ నాడీ వూళ్ళో అడుగెట్టిన్నాడు మీరు మనుసు పడ్డారన్జెప్పి నేనాయేల దానికి మాయ మాటల్జెప్పి పంపనేదా మీ పక్కలోకి..... ఆ పైడమ్మకూతురేే బాబూ సాయిత్రి... ఆసాయిత్రినే ఇయ్యాల పక్కలోకి పమ్మించరా చిట్టీ అని మీరంటన్నారే... ఏటీ నీతి రంగబాబూ..." అంటూ నిలదీసి అడుగుతున్నాడు బుజ్జిగాడు.

పైడమ్మ కూతురో పారిజాతం మేనగోడలో ఎవరికి జ్ఞాపకం?

అలాగని పైడమ్మని మాత్రం కొట్టి పారీలేను.

కారణం... మొదటి రుచి.

"ఒరెర్రా... ఎవుర్తినో ఒట్టుకొచ్చి ఇది మీ కూతురండి, ఇది మన్రాలండి అని సినిమా యెవ్వారాలేసి డబ్బులు గుంజీద్దారని సూస్తన్నావేటో... కుదర్దు. పోనీ కూతురేనంటా.. సొంత కూతురేట్రా అది. ఎక్కడో పెరిగిన్దాన్ని.. గుర్రం లాటి మనిషిని చూపెడితే చూస్తా చూస్తా సవారీ సెయ్యకుండా గుర్రాన్నొగ్గీస్తార్రా.." అన్నాను. చిట్టిగాడికి చెప్పే భాషలో చెప్తేనే బోధపడతాది. అయినా వాడింకా అయోమయంలోనే వున్నట్టున్నాడు.

"రంగ బాబలాంటి మాట్లన్నాయం కాదా?" అన్నాడు.

"ఒరే అన్నాయివేటొరే.. ఇరవయ్యేళ్ళ నాడారంభించిన పనిది. ఇన్నేళ్ళలో ఎంతమందిని జూసేనొరే. కారణవేమంటావ్. ఈ సెరీర వినప సెరీరం. మంది కోరికల్తో కాలిపోతున్నకొద్దీ గట్టిపడిపోద్దేవో ముసిల్తనవన్నది లేద్రా ఈ

సెరీరానికి... పైగా ఇది పెక్రుతి కార్యవారే... తప్పునేదు..."

"మీ సెరీరవలాటి దన్జెప్పేసి.... పెక్రుతి కార్యవన్జెప్పేసి... తియ్యటి అబద్దాలు చెప్పేసి దానమ్మని రప్పించుకున్న పక్కలోకి కూతుర్ని కూడా రప్పించుకోడం పాపంకాదా రంగబాబూ..." అన్నాడు చిట్టిగాడు.

చిట్టిగాడేటి యియేళ నీతులు పలుకుతున్నాడు. నక్క నీతులు చెప్పుద్దా? కుక్క యజమానిని కరుస్దా? మరంతే ఈడు నక్కోదవ కాదా... ఆనాడు పాతికేళ్ల వయసులో పర పర లాడుతూ వొచ్చినోడికి రుసి మప్పిందీడు కాదా. పెద్దింటోడిని కింది కీడ్పించడం అదన్నాయం కాలేదీడికి... మరి నోరు తడుపుకోడానికి ఆ కడుపు కక్కుర్తికి నాల్రూపాయల డబ్బులకోసం అన్నెం పున్కెం ఎరుగని ఆడదాన్ని.. నేనడిగేనే అనుకో... తెచ్చి నాకంటించేసేడు కాదా... అది పాపం కాదీడికి... అలాంటి పన్లు చేసినోడీడు నీతుల్జెప్తున్నాడంటే నక్కగా డనకింకేటనాల? అలాటోడిపుడు తిరగబడ్తున్నాడంటే కుక్కోదవ అనకింకేటనాల?

"ఒరి ముసిల్నాకొడుకువైపోనావు... నీకు పాపబీతో దైవబీతో పట్టుకున్నట్టుగుంది, వృద్ద నారీ పతివ్రొతన్నట్టు గిప్పుడు నువ్వి కబుర్లు సెప్తన్నావు గానొరే నీకు మూతిమీద మీసవొచ్చిన కాణ్ణుండి ఎన్ని పాపప్పను ల్జేసినావొరేచిట్టిగా? పాపంపేరుసెప్పి నన్ను జడిపిస్తన్నావు గనక వొటి సెప్తన్నానినుకో.. నిజవేన్రా, ఆ సాయిత్రినో సత్తిబామనో నేను కోరుకోడం తప్పేన్రా... కానొరే అది నా పక్కలో కొస్తే నాకు సుకవేగదరా... ఆ తప్పుడు పనివొల్ల నాకు సుకవే వొస్తంది గానీ కష్టం రాదొరే... ఇక సచ్చినాక అనుబగిస్తానని ఏదం పెప్తవా.... సచ్చినాక గందపుసెక్కల్తో కాలిస్తే నాకు తెలుస్తా కండకో ముక్క పీక్కుతింటే నాకు తెలుస్తా... అంచేత వొరే సాయిత్రిని పిల్చుకురారొరే..."

నా సిద్దాంతంవాడికి తెలిసిందే. కానేదో మనసులో దూరింది, ఆడందుకే జంకుతున్నాడు. అందుకే మరోమాత్ర వేసేను.

“ఒరే చిట్టిగా... పిల్చుకొద్దువుగాని తొందర్లేదులే గాని ముందు నాలుగ్గళాసులేసుకొ(న్రా.... ఇదిగో డబ్బులు” అని జేబులో నుండి తీసేను.

“మానాన్న వందెకరాల మాగాణి ఉన్న భూస్వామి. ఇదిగో ఈ వూళ్ళో పాతికెకరా ఉంది. పట్టణంలో కొంచెంగా చదువెలిగించినా నా కబ్బలేదు. పాతికేళ్ళొచ్చినా పియ్యూసీ దాటలేకపోయే నానాడు.

కాని నాకు మాంచి తెలివితేటలున్నాయి. ఎవరి చేతెలాగ పన్జేయించుకోవాలో బాగా తెలును. నా గురించి డబ్బా వాయించుకుంటన్నానంటారేమోగాని కింది వాళ్ళని గదమాయించగల గొంతూ, ఆకట్టుకోగల ఆరడుగుల రూపవూ ఉండడంమాత్రం నిజం. మరంచేత ఈ నిజాన్ని మానాన్న గ్రహించినాక నాకు చదువురాలేదని ఆయన మరి బాధపడలేదు. ఆ వొయసులో పన్జేయించుకునే నేర్పుందో లేదో తెలుసుకోవడం కోసం పరీక్ష పెట్టినట్టున్నాడు.

‘ఏటా దిగుబడి తగ్గుతున్న ట్టనుమానంగుంది. ఎలాగూ కోతలు మొదలయ్యేయి. అంచనా కట్టి రమ్మ’న్నాడు. ఈ వూరు తోలేసేడు.

అంటీ ముట్టని సదువు. అలగావోళ్ళతో పన్జేయించుకోవడంతో సావాసం. మరంచేత వాళ్ళ భాష బాగా పట్టేసింది నాకు. దానివల్ల లాబవూ తెలిసొచ్చింది గనక ఆ భాష వొగ్గీలేదు.

ఊళ్ళో దిగ్గానే ఈ చిట్టిగాడు తగులుకున్నాడు.

చిట్టిగాణ్ణి చూడగానే కుక్క కళ్ళల్లో మెదిలింది. దేబిరిగొట్టు మొకవేసుకొని ఎవడేటి పడేస్తాడా అని చూసేకళ్ళు... అప్పుడప్పుడు నాలిక జాపి జాపోస్తున్నట్టుగ శబ్దం చేయడం... ఆనక మందూ ముక్కా చూపిస్తే తోకూపినట్టుగా చేతుల్నూపడం... ఇయ్యన్నీ జూస్తే మరీడు కుక్కలా పడుంటాడన్పించింది. ఈడినెంటేసుకుని పొలంలోకిపోతే వరసాగ్గా సేనుకోస్తున్న పడుసు సిలకలు కన్పించేయి. నా కళ్ళు మిలమిల్లాడేయి. అందర్లోనూ పంచదార సిలకలా సూడ్డానికే నోరూరించే ఆ పిల్ల రుచికెంత తియ్యగుంటదోనని గుటకలేసేను.

నా గుటకలు కనిపెట్టేడు చిట్టిగాడు. ఏటిజేసేడో ఏటి సెప్పేడో నాకు తెల్దు. కోడి పలావుతోపాటు కమ్మని ఆ గుంటని కూడా నాకప్పజెప్పేడు. మరందుగ్గాను నా దగ్గిర ఓ వంద దాకా నాకేసేడు. అది మొదలెప్పుడీ వూరొచ్చినా నా గుటకలను కనిపెట్టడం,గుంటనప్పజెప్పడం ఆడు జేసేవోడు. అదే ఆడి బతుకయింది. మరాణ్ణి జూసేక, ఆడు చేసిన పన్లు గమనించినాక ఆడు బోకరుగాడు కాదనీ పరమ పతివ్రాతనీ ఎవుడేనా ఎందుకనుకుంటాడో నాకు బోధపడదు.

"జెండా పై కపిరాజు" గయ్యిమంటూ ఒచ్చేసేడు చిట్టిగాడు.

"ఏట్రా సిట్టీ... ఏసీసుకున్నావు గదా... మరలాగే ఎల్లిసి నా పనిగూడా సక్క బెట్టీలేకపోనావా?" అన్నాను.

"బాబూ.... రంగ బాబూ... ఏసీసుకున్నాను బాబూ నీ దయవొల్ల. మరేటనుకోక నీకు మాటల్జెప్తన్నానని..." అంటూ నానుస్తున్నాడు చిట్టిగాడు.

ఒళ్ళు మండిపోనాది.

తెల్లారి సూస్తే పేపర్ల నిండా మానభంగాలే. సివారికి పోలీస్టేషన్లోకూడా సెప్పలేని దురాసారాలే. ఎంచేత? ఎంచేతనేటి,సెరీరం కోరికల్తో కాలిపోతంటే ఏటి సేత్తారెవులైనా.

"నాకు గళాసు బలీనత. మరి నీకు గుంటల బలీనత. ఇంకోడికి పేకాట బలీనత. కాని బాబూ దేనికైనా లిమిటేసునుండాల. ఎంత ఆడ బలీనతైతే మాత్రం వావీ వరస నేకుండా కన్న కూతురితోనా... పరాయాడదంటే మన్దేశంల తల్లి రంగబాబూ" "ఒరిసిట్టీ! నాకు తెలకడుగుతాను. నేనిచ్చిన డబ్బులు కాకుండా అరువెట్టి కూడా తాగీసినావేటి..." అనడిగేను.

ఆ డినిపించుకున్నట్టు లేదు.

"సోయంగా కన్నకూతురితో బలిసున్న ఆంబోతైనా జత కట్టదు. పశువు కున్న గేనం మనిషన్నావోడి కుండాలని బోధించడానికో

కతసెప్తానాలకించు." అంటూ నాలికతో పెదాలు తడుపుకున్నాడు చిట్టిగాడు. నాకు ఒళ్ళు సిరసిరలాడిపోయింది.

"తాగుబోతు నాకొడకా... ఏట్రా కతలెప్పెప్తావు. కతలినీసి మారిపోయి న్నాకొడుకులీ బూపెపంచకంలోనే లేర్రా చిట్టినాకొడకా..." అన్నాను సిరాగ్గా.

కళ్ళు అరమూతలు పడుతున్నాయి. బలవంతాన తెరిసి నాకేసి జూసేడు చిట్టిగాడు. నవ్వుతాననుకున్నాడు. ఎక్కిళ్లు వొచ్చినాయి.

"నిజవే రంగబాబూ... నిజవే. నువ్వు సెప్పింది యెదార్థవే... తొక్కదళసరెక్కినోళ్ళని కతల్సెప్పి మార్సగలవా... అయినా నువ్వలాటోడివి కాదు. నాకు నమ్మకవే... గనక సెప్తన్నానాలకించు..." అంటూ మొదలెట్టేడు పురాణం.

"పైడమ్మనేదూ... అదే నువ్వు తొలీత రుస్సూసినావు పంచదారసిలక. ఆ పైడమ్మ దానింటి పక్కనే రాజమ్ముంది. దాన్ని నువ్వెరుగుదువు. దాని తలసెడ్డాక సిన్నాసితకా అమ్మీసి బతుకు తెరువుకోసం పక్కూరి కెళ్ళి ఆవూదూడని కొన్నది. ఆయావు బాబు గంగిగోవంటే గంగిగోవే. మరేటి సెప్పనక్కరలేదు. ఎంత సెప్తేటి బావూ తక్కువే అవుద్ది. కందిరీగనాటి కళ్ళు. ముక్మలు గుడ్డనాటి సెర్మవూ. మీకు బోదపడీనాగు సెప్పాలంటే బావూ.... ఇందాకణ్ణించీ మిమ్మల్ని నోరూరిస్తందే సాయిత్రి, ఆ సాయిత్రే సాయిత్రి బావూ. మరదీని దీనిలాగే అదికూడా ఎదకొచ్చిందండి. ఈ వూళ్ళో ఏ దూడ కానియ్యి ఈస్సరుడి గుడికాడుండే నల్లాబోతుకే జతకట్టించాల. అది రూలు. అది పద్దతండి. మరాబోతుగురించి సెప్పాలా. నందీస్పెరుడండి బాబు. మూర్తంజూసి దూడన్తోలుకెళ్లినావండి. మరానందీస్పెరుడికి దూడన్సూడగానే కళ్ళెర్ర బడ్డాయి. ముక్కంట ఆవిర్లు గుప్పుగుప్పుమంటూ బుసలు కొట్టింది. బాబయ్యా దుడుకు దుడుకుగా దూడ కాడికొచ్చి మూదూడబోయింది. బాబూ రంగబాబు సూసితీరాలేగాని సెప్పతరం కాదు బాబూ.... అంతటి గంగిగోవు దూడబిడ్డా గంగానమ్మయిపోనాది. ఒక్కపాలనందీ స్పెరుణ్ణి ఎగడా దిగడా సూసి కొమ్మిసిరింది. తొలీతగాబట్టి

అలాగ కొమ్మిసిరిందనుకున్నాం గాని గంగానమ్మలా గంగెర్రులెత్తిపోయి అంతటి నందీస్పెరుణ్ణీ కుమ్మిన పోట కుమ్మకుండా కుమ్మేసి రాజమ్మింటికి అదే పరుగు... పరిగెత్తి ఆళమ్మ కాడే సేదదీరింది రంగబాబూ...."

"ఏటీ కత సిట్టిగా... దానికేటో ఎత్తిందిగావాల కుమ్మీసుంటది. ఈ కత నాకెందుకిప్పుడీ మంచి టయాన సెప్తన్నవు... తాగేసి తాగేసి కిక్కిచ్చినాది కావాల. ఏటి సెప్తన్నదీ ఏటి లేనిదీ ఒళ్ళు తెలీకుండా వుంది. ఓరి సిట్టిగా ఇనపడ్తుందా... ఇంతకీ ఏటంటావ్..." అసలే సాయిత్రి మీద మనసుతో వేడెక్కిపోయున్నాది. దానికి తోడు ఈడి నాన్పుడు బేరవొకటి. అందికే గట్టిగానే కేకెట్టేను.

"బాబినపడతంది... బాబూ... కతంటావా... కత కాదిది నిజంగా జరిగిందే రంగబాబూ... ఎందుకు సెప్తన్నానంటావా... ఒస్తన్నా... ఒస్తన్నా బాబలాగ్గా కుమ్మీసెలిపోయిందా. ఏటీ గంగిగోవు బిడ్డేటి... నందీసెరుళ్ళాటి ఆబోతునేటి... కుమ్మిడవేటని ఆరాల్తీసేం రంగబాబూ... సివరికేటితేలిందో మీకు సెప్తే మీరు నమ్మరయ్యా... రాజమ్మ దగ్గరికా గోవు రాకమునుపు పొరుగూరి పోలయ్యింటుండేది. ఆడీ గంగిగోవునీ నందిస్పెరుడిసేతే జత కట్టించేడు. ఆ సంగతి ఆ పోలయ్యకీ రాజమ్మకి నీకూ నాకు తెలుసోతెల్దో గాని నోరులేని పశువుకి తెల్సింది బాబూ... మరంచేతది ఆరోజు... 'ఓరి జనకా... కండకావరం సేత కన్న కూతుర్నే కానలేకపోతన్నావు... మరి గంచేత నీకిదే సిచ్చ...' అని దాని భాషలో అది సెప్పేవుంటదా దూడ. సెప్పినా నీలాగే కూతురేటి కోడలేటని యినకుండా మీదికెల్లబోయేసరికి కుమ్మీసినాది... బాబూ నేను కతల్సెప్పనేదు... యెదార్దవిది..." అంటూ మందు మత్తులో మగతగా కళ్ళు మూసేస్తన్నాడు చిట్టిగాడు.

నాకు మాత్రం వున్న మత్తు కూడా దిగిపోయింది.

*(ఉదయం 9-16, ఏప్రిల్ 1987)*